కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో రూ.ల్లో) టమాటా రూ.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 21, క్యారెట్ 23, దొండకాయ 28, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5గా ఉన్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఆలయ వార్షికోత్సవం



రసూల్‌పురా: రసూల్‌పురా శివనగర్‌లోని శ్రీ కాశీ శివలింగేశ్వర స్వామి ఆలయం 35వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గురువారం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో మహా రుద్రాభిషేకం, మహా రుద్రహోమం, ఇతర పూజా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో వీఐపీలు, సామాన్య భక్తులు ఇక్కడ సమానమని, ఆలయాన్ని కమిటీ సభ్యులే అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, కాంగ్రెస్ నాయకులు శ్రీ గణేష్, ఆలయ ఆధ్యాత్మిక సేవా సమితి ప్రతినిధి ఎన్. క్రిష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు గడప రాములు, ఉపాధ్యక్షులు మాడుగుల జనార్దన్, కార్యదర్శి మూట ఐలయ్య భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి దానంకు సన్మానం



లాలాపేట: ఇటీవల సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను గురువారం ఆయన నివాసంలో తార్నాక డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దానంను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా గత కొంతకాలంగా పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ఎంపీ ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సిద్ధం కావాలని దానం నాగేందర్ ఈ సందర్భంగా వారికి సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో దానం నాగేందర్ సికింద్రాబాద్ ఎంపీగా అధిక మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తార్నాక డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు మడా శైలేందర్, శంకర్‌గౌడ్, అన్వర్, బాబి, కిషోర్ తదితరులున్నారు.

బోయిన్‌పల్లిలో ఇఫ్తార్ విందు



బోయిన్‌పల్లిలో ఇఫ్తార్‌లో జక్కుల మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్ : పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల ఇఫ్తార్ విందులతో మత సామరస్యం పరిఢవిల్లుతోందని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లి చింతల్ బస్తీ పెద్దతోకట్టాలోని మోయియుద్దీన్ అలీషా ఖాద్రీ, రహీమ్ అలీసా ఖాద్రీ దర్గా సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల అనంతరం స్థానికులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అఖిల్ బాబా, హసీన్ ఖాన్, ఇర్ఫాన్, తారిఖ్, ముఖ్తార్, రిజ్వాన్, సాజిద్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్లూ విద్యార్థి సంఘాల ఎన్నికల ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: 'ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ (ఇఫ్లూ) విద్యార్థి సంఘాల ఎన్నికల ఫలితాలను గురువారం ప్రకటించారు. ఇన్‌సాఫ్ అలయెన్స్ తరపున రాథోడ్ రఘువర్ధన్ విజయం సాధించారు. ఉపాధ్యక్షురాలిగా నితా ఫాతిమా, జనరల్ సెక్రటరీగా రణబషీర్, జాయింట్ సెక్రటరీగా శ్వేత సహా, కల్చరల్ సెక్రటరీగా ఉత్తరా కిరణ్, స్పోర్ట్ సెక్రటరీగా నిశంత్‌కుమార్ ఇన్‌సాఫ్ అలయెన్స్ తరపున గెలిపొందారు. తెలంగాణ విద్యార్థుల ఫోరం, ఎస్ఎస్‌యూఐ, ఎంఎస్ఎఫ్, ఫేటర్నిటీ, ప్రిస్మా విద్యార్థి సంఘాలు ఇన్‌సాఫ్ అలయెన్స్‌లో భాగమని వివరించారు.

దారి తప్పి.. పెట్రోలింగ్ పోలీసులకు చిక్కి..



చిక్కడపల్లి: దారితప్పి వచ్చి చిక్కిన బాలుడిని చిక్కడపల్లి పోలీసులు చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య తెలిపిన కథనం ప్రకారం... నాగమయ్యకుంట అమ్మవారి దేవాలయం వద్ద బుధవారంరాత్రి ఒంటి గంట సమయంలో ఓ బాలుడు(10) చిక్కడపల్లి పెట్రోలింగ్ పోలీసుల కంటపడ్డాడు. రోడ్డుపై తిరుగుతూ కనిపించడంతో పోలీసులు చేరదీశారు. అతని గురించిన వివరాలు వాకబు చేయగా చెప్పలేకపోయాడు. స్టేషన్‌కు తీసుకువచ్చి ప్రేమగా మాట్లాడుతూ ఆరా తీశారు. అతడు చెప్పిన వివరాల ప్రకారం వారాసిగూడకు చెందిన జైద్ అన్సారీగా పోలీసులు గుర్తించి తల్లిదండ్రులను వెతికి పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం వారికి బాలుడిని అప్పజెప్పారు. తప్పిపోయిన కుమారుడిని తమకు అప్పగించడంతో ఆ బాలుడి తల్లదండ్రులు చిక్కడపల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యయనమే లక్ష్యసాధనకు మార్గం

సుందరయ్య విజ్ఞానకేంద్రం: న్యాయ విద్యలో అధ్యయనాలు చేయడం ద్వారా ఉన్నత లక్ష్యాలు సాధించుకునేందుకు మార్గం సుగమం అవుతుందని ఐసీఎస్ఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సీఎస్ రాజవోలు వెంకటరమణ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల కార్యదర్శి, ఎమ్మెల్యే జి.వినోద్‌వెంకటస్వామి అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాల, ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ అవేర్‌నెస్ కార్యక్రమం జరిగింది. అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ లక్ష్మీనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

షెల్టర్ లెస్ జర్నీ!

- మండుటెండలో ప్రయాణికుల వెతలు
- షెల్టర్లు ఆక్రమణలకు గురయ్యాయనే విమర్శలు

సనత్‌నగర్: ఎండాకాలం వచ్చేసింది. ఏయేటికాయేడు బస్ షెల్టర్లు నిర్మించి ప్రయాణికులకు నీడ కల్పిస్తారని భావిస్తున్నా.. ప్రయాణికులకు అడియాశే ఎదురౌతోతంది. ఫలితంగా మండుటెండలతో ప్రయాణికులు 'షెల్టర్ లెస్ జర్నీ'తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఎర్రగడ్డ చౌరస్తాలో ఎండలో రోడ్డుపైనే ఇలా..

బస్సుషెల్టర్లు లేక కొన్ని చోట్ల..

బస్సు షెల్టర్లు లేక వ్యాపారాలకు నెలవుగా మారి ప్రయాణికుల అవసరాలను తీర్చని షెల్టర్లు మరికొన్ని చోట్ల.. షెల్టర్లు ఉన్నచోట బస్సులు నిలపని విచిత్ర పరిస్థితితో ఇంకొన్ని చోట్ల వెరసి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు.

ప్రకటనలకే పరిమితం..

ఓ వైపు ప్రయాణికుల సంక్షేమమే తమ లక్ష్యంగా ఆర్టీసీ ప్రకటనలతో ఊదరగొడుతున్నా.. ఆచరణలో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందింది. సనత్‌నగర్ బస్టాండ్ నుంచి రోజుకు దాదాపుగా 80-100 బస్సులు నగరంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. వేలాది మంది ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి.

షెల్టర్లే కరువు..

బస్సుల కోసం వేచి ఉందామంటే బస్సు షెల్టర్లే ప్రయాణికులకు కరువయ్యాయి. ముఖ్యంగా సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్, జెక్‌కాలనీ రిక్వెస్ట్ స్టాప్, ఎర్రగడ్డ చౌరస్తా, బలకంపేట ప్రాంతాల్లో బస్సుషెల్టర్లు లేక నడిరోడ్డుపైనే ప్రయాణికులు నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. రోజురోజుకు ఎండలు తీవ్రమవుతుండటంతో రోడ్లపై ప్రయాణికులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

కొన్ని చోట్ల వ్యాపార కేంద్రాలుగా..

ఇక కొన్ని ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు ఉన్నా.. వ్యాపారాలకు కేంద్రంగా మారిపోయాయి. ముఖ్యంగా ఈఎస్ఐ (కూకట్‌పల్లి వైపు వెళ్లే బస్సులు నిలిచే బస్టాప్), ఎర్రగడ్డ ప్రాంతాల్లోని బస్‌షెల్టర్లు వ్యాపారాలతో ఆక్రమణలకు గురయ్యాయనే విమర్శలున్నాయి.

లక్షలాది రూపాయలతో నిర్మించి నిరుపయోగంగా..

లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్సు షెల్టర్లు కాస్తా.. నిరుపయోగంగా మారి ప్రయాణికులు నడిరోడ్డుపై వేచి ఉండాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే కొన్ని చోట్ల బస్సుషెల్టర్లు ఉన్నా.. బస్సులు ఆగని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా టీబీ ఆసుపత్రి, సనత్‌నగర్ హెటిరో డ్రగ్స్ వంటి బస్టాపుల్లో అన్ని బస్సులు ఆగడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయంపైనే దృష్టి...

బస్‌షెల్టర్ల నిర్మాణం, గుర్తింపు ప్రక్రియ ఆర్టీసీ చేపట్టాల్సి ఉండగా.. వాటి నిర్మాణ బాధ్యత జీహెచ్ఎంసీ చూస్తోంది. చాలాచోట్ల బస్ షెల్టర్లు ఉన్నా.. అవి కేవలం ప్రకటనలకు మాత్రమే ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోంది. ప్రయాణికుల ప్రయోజనాలను పక్కనపెట్టి కేవలం ఆదాయం కోసమే ప్రకటనల నిమిత్తం షెల్టర్ల నిర్మాణం జరపడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. సమన్వయంతో వ్యవహరించాలి.

- ప్రయాణికుల నుంచి ప్రతిరోజూ లక్షలాది రూపాయల ఆదాయం ఆర్టీసీకి అందుతున్నా.. షెల్టర్ల ఏర్పాటులో ఆలస్యం తగదని, దీనిపై ఆర్టీసీ, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి బస్సు షెల్టర్లను ఏర్పాటుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న బస్సు షెల్టర్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద..

స్వచ్ఛతపై అవగాహన

సనత్‌నగర్: గృహ నివాసితులు తమ ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు మాత్రమే చెత్తను అందించాలని ఖైరతాబాద్ సర్కిల్ ఉప కమిషనర్ జగన్ అన్నారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో గురువారం స్వచ్ఛతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప కమిషనర్ జగన్‌తో పాటు ఏఎంహెచ్ఓ డాక్టర్ ప్రవీణ తదితరులు హాజరై స్వచ్ఛతా కార్యక్రమాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. చాలామంది రోడ్లపై చెత్తను పడేసి చేతులు దులుపుకోవడం సరికాదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరి ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్రతి కాలనీ, వీధి, ప్రతి ఇంటి ముందుకు స్వచ్ఛతా ఆటోలు వస్తున్నాయని, ఇళ్లల్లోని చెత్తను ఆటోలకు అందించి స్వచ్ఛతకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా.. పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య విభాగం సూపర్‌వైజర్లు రవి, అరవింద్ కుమార్, బస్తీ నాయకులు, మహిళా పొదుపు సంఘాల ప్రతినిధులు, రీసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

- అల్లావుద్దీన్ కోఠి, సనత్‌నగర్, అమీర్‌పేట్ డివిజన్లలో ఫ్లకార్డులను ప్రదర్శిస్తూ స్థానికులకు అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు.



అవగాహన కల్పిస్తున్న ఖైరతాబాద్ డిప్యూటీ కమిషనర్ జగన్

గంజాయి పట్టివేత

- 50 కేజీల గంజాయి స్వాధీనం
- పోలీసులను తోసేసి నిందితుల పరార్



గంజాయి దొరికిన లాడ్జి

రాంగోపాల్‌పేట్: పోలీసులు లాడ్జీలో తనిఖీలు చేస్తుండగా.. సికింద్రాబాద్ రెతిఫైల్ బస్టాండ్ ఎదురుగా ఉండే ఓ లాడ్జీలో 50 కేజీల గంజాయి పట్టుబడింది. పోలీసులను తోసేసి నిందితులు పారిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. ఈనెల 27న అర్ధరాత్రి గోపాలపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాగా మొదటి అంతస్తులోని 507 గదిలోకి వెళ్లి ఇద్దరు వ్యక్తుల వివరాలు అడిగారు. వారి ప్రవర్తనపై అనుమానం వచ్చి ప్రశ్నించగా.. నిందితులిద్దరు ఎస్సై, కానిస్టేబుళ్లను తోసేసి పారిపోయారు. లాడ్జిలో తనిఖీల అనంతరం 50 కేజీల గంజాయిని పోలీసులు గుర్తించారు. హోటల్ రికార్డులు పరిశీలించిన పోలీసులు నిందితులు అమన్‌సింగ్, అర్జున్ పేర్లతో బీహార్, గుజరాత్ అడ్రస్‌తో రికార్డుల్లో నమోదై ఉందన్నారు. ఎలాంటి గుర్తింపు కార్డులు హోటల్ సిబ్బందికి అప్పగించకుండా యజమానికి ఫోన్‌లో పంపిస్తామని నిందితులు చెప్పినట్టు సమాచారం. నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదన్నారు.

దివ్యాంగ ఉద్యోగుల ఫిట్‌మెంట్‌పై నివేదిస్తా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వినికిడి లోపంతో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానని పీఆర్‌సీ చైర్మన్ ఎన్.శివశంకర్ తెలిపారు. వైకల్యంతో ఉన్నవారికి రోస్టర్ పాయింట్స్ 100 నుంచి 200, 201 నుంచి 400 వరకు ప్రమోషన్‌లో ఉన్న రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ డెఫ్ అండ్ డెమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శివానందం, ఎం.శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం పీఆర్‌సీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. పీఆర్‌సీ చైర్మన్‌ను కలిసినవారిలో డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, జాతీయ కోకన్వీనర్ వి.భారతి, కె.వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.

ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాటర్‌వర్క్స్ ఉద్యోగిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి, కఠినచర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్(బీఆర్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంబాబుయాదవ్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మినారాయణలతో కలిసి మాట్లాడారు. వాటర్ వర్క్స్ మాదన్నపేట్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగి సీహెచ్ రమేష్‌పై బుధవారం రెయిన్‌బజార్‌కు చెందిన ఓ వ్యక్తి దాడి చేశారని తెలిపారు. డ్రైనేజీలో నుంచి తీసిన మట్టిని తొలగించలేదని నెపంతో ఏ మాత్రం సంబంధం లేని రమేష్‌పై దాడి చేశారని అన్నారు. ఐఎన్‌టీయూసీ అనుబంధం సంఘం జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మాత్రం నిందితుడిని తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ఆలయ స్థలం మార్చాలని వినతి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ పరిధిలోని బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్-6లో రోడ్డు మధ్యన ఉన్న పోచమ్మ ఆలయాన్ని రోడ్డునెంబర్-5లోకి మార్చేలా స్థలం కేటాయింపు జరపాలని ఆలయ అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలయం రోడ్డు మధ్యలో ఉండటం వల్ల భక్తులకు అసౌకర్యంగా ఉంటుందన్నారు. బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్ -5లో సర్వేనెంబర్ 203, 204, 205లలో 400 గజాల ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందని, ఆలయ నిర్మాణానికి ఈ స్థలం అనువుగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని ఇక్కడికి మార్చేందుకు సదరు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ తరపున బరిలో ఉంటా..


బీజేపీ నేత తులసీ విజయ్‌కుమార్



తులసీ విజయ్‌కుమార్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో తాను బీజేపీ తరపున బరిలో ఉంటానని ఇంక్రెడబుల్ ఇండియా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ తులసీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు త్వరలోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసి టికెట్ కేటాయించాల్సిందిగా కోరతానన్నారు. గత నవంబర్‌లోనే తాను బీజేపీ టికెట్ ఆశించినప్పటికీ పార్టీ కేటాయించలేదన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన శ్రీగణేశ్ కాంగ్రెస్‌లో చేరిపోయాడన్నారు. ఈసారైనా అలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా పార్టీకి విధేయుడిగా ఉండే తనకు టికెట్ కేటాయించాలని కోరారు. కంటోన్మెంట్ ప్రాంత సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడతానని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం



బాలసుబ్రహ్మణ్యం (ఫైల్)

చిలకలగూడ : వేద పారాయణం చేసేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీకి చెందిన వెంకట బాలసుబ్రహ్మణ్యం (57) వృత్తిరీత్యా వేదపండితుడు. కాగా యాదగిరిగుట్ట ఆలయంలో వేద పారాయణం చేసేందుకు ఈనెల 10న సాయంత్రం 5 గంటలకు సోదరుడు సుధాకర్ ద్విచక్ర వాహనంపై సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఈ క్రమంలో ఆయన రైల్వేస్టేషన్ లోపలకు వెళ్లగా.. సుధాకర్ తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. సోదరుడి నుంచి సమాచారం రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆలయానికి వెళ్లి వాకబు చేయగా.. పారాయణానికి రాలేదని చెప్పారు. దీంతో సోదరి శ్రీదేవి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'కంటోన్మెంట్‌లో కాంగ్రెస్‌దే విజయం'



సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో అన్నదానంలో శ్రీగణేశ్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని కాంగ్రెస్ నేత ఎన్. శ్రీగణేశ్ అన్నారు. మారేడుపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, స్థానిక సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల ఆదరాభిమానాలు చూరగొందని అభిప్రాయపడ్డారు. కంటోన్మెంట్‌కు సంబంధించి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పనులను పరిష్కరించిందని రూ.48 కోట్ల పెండింగ్ టీపీటీ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ప్రతిష్టాత్మక ఎలివేటెడ్ కారిడార్‌లకు అనుమతులు మంజూరు చేయించడంతో పాటు పనులకు శంకుస్థాపన చేపట్టిందన్నారు. ఈ పనులు పూర్తయితే కంటోన్మెంట్‌లో ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియను శరవేగంగా ముందుకు సాగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

వినతిపత్రం అందజేత



మాట్లాడుతున్న ఇటుక శ్రీకిషన్ మాదిగ

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో మాదిగ కులానికి చెందిన స్థానిక అభ్యర్థికి టికెట్ కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు కంటోన్మెంట్ మాదిగల బలగం సంఘం ప్రతినిధులు ఇటుక శ్రీ కిషన్‌మాదిగ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గంలో మాదిగ కులస్తులు అధికశాతం ఉన్నారని కాని కొందరు బోర్డు మాజీ సభ్యులు తమ స్వలాభం కోసం మాదిగలకు కాకుండా మాలలకే ప్రాధాన్యత ఇస్తూ.. టికెట్లు కేటాయించేలా కృషి చేస్తున్నారని, బోర్డు ఎన్నికల్లో వారిని ఓడించి మాదిగల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. మాదిగల రౌండ్‌టేబుల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని కలసి కాంగ్రెస్ పార్టీ తరపున మాదిగ స్థానిక అభ్యర్థికి టికెట్ కేటాయించాలని కోరనున్నట్లు చెప్పారు. ఉప ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మాదిగలకు టికెట్ కేటాయించని పక్షంలో మాదిగల బలగం సంఘం నుంచి ఒక్కరు బరిలో ఉంటారని ఇటుక గోపీ, సునీల్ మాదిగ పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు అజిత్ కళ్యాణ్, మంద మధుకర్, బ్యాగరి నరసింహ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే గోపాల్



ఉమ్రాకు వెళ్తున్న నసీర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ అంకితభావంతో కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ నాయకుడు నసీర్(అత్తుబాయ్) తన అనుచరులతో ముస్లింలు పవిత్రంగా భావించే ఉమ్రాకు బయలుదేరడంతో డివిజన్ బీఆర్ఎస్ కమిటీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీల సంక్షేమం, ఉమ్రా యాత్రకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు అన్ని విధాలా అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్ రావు, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం షరీఫ్, జునేద్ బాగ్దాదీ, నాయకులు ఉమాకాంత్, జబ్బార్, మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల అమలులో రాష్ట్ర సర్కారు విఫలం

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం డివిజన్‌లోని చిక్కడపల్లి, బాపునగర్ ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఆయన కలసి మాట్లాడారు. మోదీ గ్యారంటీలు, సంక్షేమ పథకాలపై ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఔర్ ఏక్ బార్ మోదీ సర్కార్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, దామోదర్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, కల్యాణ్, సాయికిరణ్ పాల్గొన్నారు.



కరపత్రాలతో వివరిస్తున్న డాక్టర్ లక్ష్మణ్, వినయ్ కుమార్, సాయిచంద్

భోజనంలో బొద్దింకలు వచ్చాయని విద్యార్థుల ధర్నా



రసూల్‌పురా: సికింద్రాబాద్ పీజీ కళాశాలల్లో హాస్టల్ విద్యార్థుల భోజనంలో బొద్దింకలు వచ్చాయని వండిన గిన్నెలు తీసుకుని బయటకి వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల సమయంలో హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు వంట చేసి వెళ్లిపోతున్నారని వార్డెన్ నాగేశ్వర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు రాత్రి 8 గంటల సమయంలో విద్యార్థులు భోజనం చేస్తుండగా.. మీల్‌మేకర్ కూరలో చనిపోయిన బొద్దింకలు కనిపించాయన్నారు. ఇటీవల దశలవారీగా పలువురు విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురవుతున్నారని, ఆస్పత్రుల్లో చేరుతున్నారని చెప్పారు. కాగా ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న బేగంపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను సముదాయించారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వార్డెన్ నాగేశ్వర్‌రావుకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఆయన హుటాహుటిన కళాశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు, దీంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

- భీమా మైదాన్ బస్తీలో పోలీసుల కార్డన్ సెర్చ్
- అనుమతులు లేని 10 ద్విచక్ర వాహనాల స్వాధీనం

చిక్కడపల్లి: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్ ప్రజలకు సూచించారు. దోమలగూడ సర్కిల్ పరిధిలోని భీమా మైదాన్ బస్తీలో గురువారం రాత్రి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. భీమా మైదాన్ బస్తీలో ఎవరెవరు నివాసం ఉంటున్నారు... అందరూ స్థానికులేనా లేక గుర్తుతెలియనివారు ఎవరైనా నివాసం ఉంటున్నారా... అనే కోణాల్లో విచారణ చేపట్టారు. దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో ప్రతి ఇంటినీ అణువణువునా గాలించారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ ఆనంద్, గాంధీనగర్ ఏసీపీ మొగులయ్యలు మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా స్థానికులు పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. గాంధీనగర్, దోమలగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నివాసం ఉంటూ నేరాపణలు ఎదుర్కొంటున్న వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల వరకు వారు ప్రశాంతంగా ఉండాలని, నిబంధనలు పాటించని యెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ సీఐ డి.రాజు, దోమలగూడ డీఐ వరప్రసాద్, ఎస్ఐలు నాగరాజురెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హరీష్, నయీమ్‌ఖాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



భీమామైదాన్‌లో స్థానికులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న పోలీసులు